# సాక్షి
## విశాఖపట్నం

బుధవారం । 8 । నవంబర్ । 2023





## న్యూస్‌రీల్

### 12 నుంచి 16 వరకు సింహగిరిపై ఆర్జిత సేవలు రద్దు



**సింహాచలం:** సింహగిరిపై ఈనెల 12 నుంచి 16వ తేదీ వరకు మణవాళ మహాముని తిరునక్షత్ర పూజలు నిర్వహించనున్నట్లు ఈవో శ్రీనివాసమూర్తి తెలిపారు. అలాగే 23 నుంచి 27వ తేదీ వరకు **తిరుమంగై** ఆళ్వార్ తిరునక్షత్ర పూజలు జరిపిస్తామన్నారు. ఆ రోజుల్లో ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. 12వ తేదీన స్వాతి హోమం యథావిధిగా జరుగుతుందన్నారు. దీపావళి సందర్భంగా ఈ నెల 12న సాయంత్రం 6గంటల వరకు స్వామి దర్శనాలు లభిస్తాయని తెలిపారు. ఈ నెల 23న కార్తీక శుద్ధ ఏకాదశి, 27న ఆలయంలో వృశ్చిక దీపారాధనను పురస్కరించుకుని రాత్రి 7గంటల వరకు దర్శనాలు లభిస్తాయన్నారు.

### డీసీఐఎల్ లాభం రూ.16.77 కోట్లు

**దొండపర్తి:** డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ రెండో క్వార్టర్‌లో అద్భుతమైన లాభాన్ని ఆర్జించింది. రూ.198.59 కోట్ల టర్నోవర్ సాధించి రూ.16.77 కోట్లు లాభం సొంతం చేసుకుంది. షేర్ విలువ కూడా రూ.5.99 పెరిగింది. 2023–24లో రూ.1200 కోట్లు టర్నోవర్ సాధించాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. డీసీఐఎల్, వీపీఏ చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు, డీసీఐఎల్ ఎండీ అండ్ సీఈఓ కెప్టెన్ ఎస్.దివాకర్ సంస్థ సాధించిన ప్రగతి పట్ల అధికారులు, ఉద్యోగులను అభినందించారు.

### నేడు మహారాణిపేటలో జగనన్నకు చెబుదాం

**మహారాణిపేట:** మహారాణిపేట తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న టర్నర్ చౌల్ట్రీ కల్యాణ మండపంలో బుధవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి నిర్వహించే ఈ కార్యక్రమానికి అన్ని శాఖల విభాగాధిపతులు, జీవీఎంసీ, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది హాజరు కావాలని ఆదేశించారు.

# భీమిలిలో క్రీడా గ్రామం

- 8 ఎకరాల్లో స్పోర్ట్స్ విలేజ్ ఏర్పాటుకు సన్నాహాలు
- సాంకేతిక సలహాదారు నియామకానికి టెండర్లు
- ముడసర్లోవ పార్కుకు కొత్త రూపు
- 250 ఎకరాల్లో వినోదానికి కేరాఫ్ అడ్రస్‌గా అభివృద్ధి



స్పోర్ట్స్ విలేజ్ నమూనా

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

విశాఖ నగరం అభివృద్ధిలో కొత్త పుంతలు తొక్కుతోంది. నూతన రోడ్ల నిర్మాణం, జంక్షన్ల విస్తరణ, పార్కుల ఆధునీకీకరణ తదితర పనులు చురుగ్గా సాగుతుండగా.. మరిన్ని సౌకర్యాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ముఖ్యంగా క్రీడాకారుల కోసం ప్రత్యేకంగా క్రీడాగ్రామం ఏర్పాటుకు సంకల్పించింది. భీమిలిలో 8 ఎకరాల్లో స్పోర్ట్స్ విలేజ్ ఏర్పాటు చేసి.. అన్ని అవుట్ డోర్, ఇండోర్ గేమ్స్ ఒకే చోట అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. మరో వైపు 250 ఎకరాల విస్తీర్ణంలోని ముడసర్లోవ పార్కు వినోదానికి కేరాఫ్ అడ్రస్‌గా మార్చేందుకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ)తో అభివృద్ధి చేసేందుకుగానూ సాంకేతిక సలహాదారుల నియామకానికి జీవీఎంసీ టెండర్లను ఆహ్వానించింది.

**అన్ని క్రీడలు ఒకే చోట**

జిల్లాలో అన్ని క్రీడలు ఒకే చోట నిర్వహించేలా భీమిలిలోని 8 ఎకరాల్లో స్పోర్ట్స్ విలేజ్(క్రీడా గ్రామం) ఏర్పాటు చేయాలని జీవీఎంసీ భావిస్తోంది. ఇందు కోసం సాంకేతిక సలహాదారును నియమించాలని నిర్ణయించింది. క్రీడా గ్రామం పూర్తయితే బాస్కెట్ బాల్, టేబుల్ టెన్నిస్, త్రో బాల్, వాలీబాల్, హాకీ వంటి ఇండోర్, అవుట్ డోర్ గేమ్స్ అందుబాటులోకి రానున్నాయి.

**ప్రకటనలకే టీడీపీ పరిమితం**

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రూ.300 కోట్లతో స్పోర్ట్స్ విలేజీని నిర్మిస్తామని ప్రకటించారు. మొదటగా పెందుర్తిలో ఆ తర్వాత స్టీల్ ప్లాంట్ స్థలంలో ఏర్పాటు చేస్తామని చెప్పారు. స్టీల్‌ప్లాంట్‌కు చెందిన భూముల విషయంలో స్పష్టత రాకపోవడంతో చివరికి భీమిలిలో ఏర్పాటు చేస్తామన్నారు. 2019 ఎన్నికలకు ముందు ఫిబ్రవరిలో స్పోర్ట్స్ విలేజీ ఏర్పాటుపై పూర్తిస్థాయి ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) తయారు చేస్తామని చెప్పగా.. అది కేవలం ప్రకటనలకే పరిమితమైంది. ఆ తర్వాత అధికారం చేపట్టిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎంవీపీలో స్పోర్ట్స్ ఎరీనాను సకాలంలో పూర్తి చేసింది. విశాఖలో మరో క్రికెట్ స్టేడియం నిర్మించాలని నిర్ణయించింది. ఇందుకు అనువైన ప్రాంతాన్ని బీచ్‌కు సమీపంలో అన్వేషిస్తున్నారు. వీటితో పాటు భీమిలిలో ఏర్పాటు చేయనున్న స్పోర్ట్స్ విలేజీతో క్రీడాకారులకు ఎంతో మేలు జరగనుంది.

### 250 ఎకరాల్లో పార్కు అభివృద్ధి

ముడసర్లోవ పార్కును నగరవాసుల వినోదానికి కేంద్రంగా మార్చాలని జీవీఎంసీ నిర్ణయించింది. బోటింగ్ సదుపాయంతో పాటు కుటుంబ సమేతంగా సేదతీరేందుకు లాన్స్, ఫుడ్ కోర్టులు, చిన్న పిల్లల ఆట ప్రాంతం ఏర్పాటు చేయనుంది. అలాగే మ్యూజికల్ ఫౌంటెన్లు, బోటింగ్, కయాకింగ్‌తో స్నో ప్రాంతాన్ని కూడా అభివృద్ధి చేయాలని భావిస్తున్నారు. ఈ స్నోపై స్కేటింగ్ చేసేందుకు అనుగుణంగా 'స్కింగ్'చేసే అనువైన ప్రాంతాన్ని అభివృద్ధి చేయనున్నారు. మొత్తం 250 ఎకరాలను అభివృద్ధి చేసేలా ప్లాన్ అందించేందుకు సాంకేతిక సలహాదారు నియామకానికి ఇప్పటికే టెండర్లను ఆహ్వానించింది.

### నగరవాసులకు వీలైనన్ని సౌకర్యాలు



జీవీఎంసీ పరిధిలోని ప్రజల అవసరాలను తీర్చేందుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే రోడ్లను అభివృద్ధి చేయడంతో పాటు జంక్షన్లకు కొత్త రూపు తీసుకొస్తున్నాం. అవకాశం ఉన్న ప్రాంతాల్లో రోడ్లను మరింత వెడల్పు చేస్తున్నాం. వీటితో పాటు నగరవాసులకు మరింత ఆహ్లాదం, వినోదం పంచేందుకుగా ముడసర్లోవ పార్కును అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. క్రీడాభివృద్ధి కోసం భీమిలిలో స్పోర్ట్స్ విలేజ్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నాం. టెండర్ల ప్రక్రియ ముగిసిన తర్వాత పీపీపీ పద్ధతిలో వీటిని అభివృద్ధి చేస్తాం.

– గొలగాని హరి వెంకటకుమారి, మేయర్

# 2,02,655 మందికి వైద్యసేవలు

- జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు విజయవంతం
- పేదల వద్దకు వెళ్లి వైద్య సేవలు అందించడంపై హర్షాతిరేకాలు

**మహారాణిపేట:** గత 40 రోజుల నుంచి విజయవంతంగా జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు మంగళవారంతో ముగిశాయి. సెప్టెంబర్ 30 నుంచి ఈనెల 7వ తేదీ వరకు జిల్లాలో మొత్తం 468 వైద్య శిబిరాలు(అర్బన్‌లో 414, రూరల్‌లో 54) నిర్వహించి, 2,02,655 మందికి ఓపీ సేవలు అందించారు. మొత్తం 2,358 మందిని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా పలు నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేశారు. అర్బన్, రూరల్‌లో మొత్తం 22,951 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 9,704 మందికి కళ్ల అద్దాలు, 1589 మందికి క్యాటరాక్ట్ శస్త్ర చికిత్సలు నిర్వహించాలని రిఫర్ చేశారు. టి.బి.అనుమానిత లక్షణాలు 7,095 మంది, లెప్రసీ అనుమానం 359 మంది, రక్తహీనత 3,877, బీపీ పరీక్షలు 14,010, షుగర్ పరీక్షలు 4544 మంది, పుట్టుకతో చిన్నపిల్లల రుగ్మతలు 14 మందికి గుర్తించారు. 9 రకాల పరీక్షలు నిర్వహించి, అవసరమైన రోగులకు 175 రకాల మందులను రోగులకు అందజేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను అందరి సహకారంతో విజయవంతంగా నిర్వహించామని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు.

# 28,499 మందికి రూ.32.75 కోట్లు



అకౌంట్లలో రైతు భరోసా జమ

రైతులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, జేసీ విశ్వనాథన్

**ఆనందపురం :** దేశానికి వెన్నుముకగా నిలుస్తున్న రైతుల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు పథకాలు అమలుచేస్తూ వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహిస్తున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని బోని గ్రామంలో మంగళవారం జిల్లా స్థాయిలో ఐదో ఏట 2వ విడత వైఎస్సార్ రైతు భరోసా పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్ రైతు భరోసా సాయాన్ని పుట్టపర్తిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాలో నేరుగా నగదు జమ చేసే కార్యక్రమాన్ని రైతులకు లైవ్‌లో చూపించారు. అనంతరం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయాన్ని పండగ చేసేందుకు కృషి చేస్తున్నారన్నారు. భీమిలి నియోజకవర్గంలో 3,933 మంది రైతులకు ఏడాదికి రూ.1.84 లక్షల ఉచిత విద్యుత్ రాయితీని ప్రభుత్వం అందిస్తోందని వివరించారు. వైఎస్సార్ యంత్ర సేవా కేంద్రాలు ద్వారా 38 గ్రూపులకు రూ.1.32 కోట్లు, రూ.12.92 లక్షల రాయతీతో రైతులకు విత్తనాలను పంపిణీ చేశామన్నారు. జేసీ విశ్వనాథన్ మాట్లాడుతూ వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ కింద జిల్లాలోని 28,499 మంది రైతులకు రూ.32.75 కోట్లు జమ చేశామన్నారు. ఇళ్ల స్థలాల కోసం చేసుకున్న దరఖాస్తులను 90 రోజుల్లో పరిష్కరిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా భీమిలి నియోజకవర్గ రైతులకు రైతు భరోసా సాయం చెక్కు అందజేశారు. పలువురు ఉత్తమ రైతులను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్డీవో భాస్కరరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు, జిల్లా వ్యవసాయాధికారి కె.అప్పలస్వామి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మన్మథరావు, పశుసంవర్ధక శాఖ జేడీ రామకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, భీమిలి, పద్మనాభం ఎంపీపీలు దంతులూరి వాసురాజు, కంటుబోతు రాంబాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు దాట్ల పెదబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

# మొక్కవోని 'ఉక్కు' సంకల్పం

- నేటికి దీక్షలు ప్రారంభించి 1000 రోజులు
- నేడు అన్ని జిల్లాల్లో ర్యాలీలు
- జిల్లాలోని విద్యా సంస్థలు బంద్



జాతీయ రహదారిపై స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల బైక్ ర్యాలీ (ఫైల్)

**ఉక్కునగరం :** విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చ్ వద్ద ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి వెయ్యి రోజులు పూర్తిచేసుకోనున్నాయి. స్టీల్ ప్లాంట్‌ను నూరు శాతం వ్యూహాత్మక అమ్మకం చేయాలని 2021 జనవరి 27న కేంద్ర కేబినెట్ కమిటీ ఆన్ ఎకనమిక్ ఎఫైర్స్ కమిటీ నిర్ణయించింది. దీంతో ఉక్కు కార్మిక వర్గం భగ్గుమంది. ఆ నిర్ణయానికి వ్యతిరేకంగా పలు ఆందోళనలు నిర్వహించింది. ఢిల్లీలో రెండు రోజులు ధర్నాలు చేపట్టారు. ముఖ్యంగా జాతీయ రహదారిని రెండు రోజుల పాటు దిగ్బంధించారు. స్టీల్‌ప్లాంట్ పరిపాలన భవనం ముట్టడి, గేట్ల ముట్టడి చేపట్టారు. ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో పార్లమెంట్‌లో పలువురు ఎంపీలు అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం వెనక్కు తగ్గేది లేదని తేల్చి చెప్పింది. ఇందులో భాగంగా అమ్మకాల ప్రక్రియలకు ట్రాన్సాక్షన్, లీగల్ అడ్వైజర్ల నియామకాలు చేపట్టింది. ఉక్కు ఉద్యమానికి బీజేపీ మినహా అన్ని రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు, రచయితలు, మేధావులు, రైతు సంఘాలు, ప్రజా సంఘాలు ఇలా అన్ని వర్గాలకు చెందిన వారు మద్దతిస్తూ దీక్షల్లో పాల్గొంటున్నాయి. దీక్షలు ప్రారంభించి వెయ్యి రోజులు పూర్తవుతున్న సందర్భంగా బుధవారం వివిధ రూపాల్లో ఆందోళన చేయనున్నారు.

**నేడు ర్యాలీలు, విద్యా సంస్థలు బంద్**

దీక్షలు ప్రారంభించి వెయ్యి రోజులు అవుతున్న సందర్భంగా బుధవారం వివిధ రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు, విద్యార్థి సంఘాలు, రైతు సంఘాలు ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ర్యాలీలు జరగనున్నాయి. అదే విధంగా కళాశాలలు, పాఠశాలలు బంద్ పాటించనున్నాయని ఉక్కు పోరాట కమిటీ నాయకులు తెలిపారు.

### రాజకీయ పార్టీలతో సమన్వయ కమిటీ



ఇప్పటివరకు కార్మిక సంఘాలు పోరాటాలు చేశాయి. ఇకపై రాజకీయ పార్టీలకు ఆ బాధ్యత అప్పగించనున్నాం. రాజకీయ పార్టీల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచనున్నాం. స్టీల్‌ప్లాంట్‌ను సొంతంగా నిర్వహించాలి లేదా సెయిల్‌లో విలీనం చేయాలనే నినాదంతో ముందుకు సాగుతాం.

– డి.ఆదినారాయణ, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్

### మొండి వైఖరి తగదు



కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ పట్ల మొండి వైఖరి అవలంబిస్తోంది. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు, మేధావి వర్గాలు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుండా ముందుకు సాగుతోంది. ఇదే వైఖరి కొనసాగిస్తే బీజేపీ ప్రజాగ్రహానికి గురికాక తప్పదు.

– మంత్రి రాజశేఖర్, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్

### కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి



కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఐక్యంగా వెయ్యి రోజులపాటు ఆందోళనలు చేశాం. రాష్ట్రం విడిపోయిన తర్వాత కొత్త పరిశ్రమలు ఇవ్వకపోగా ఉన్న పెద్ద పరిశ్రమను ప్రైవేటీకరించాలని చూడటంపై ప్రజాగ్రహం వ్యక్తమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తేవాల్సి ఉంది.

– జె.అయోధ్యరామ్, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కోకన్వీనర్

# బాణసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరి

**దొండపర్తి:** అనుమతులు లేకుండా ఇళ్లు, షాపులు, జనసముదాల మధ్య గొడౌన్లలో బాణసంచా నిల్వ చేసినా.. లైసెన్సులు లేకుండా విక్రయించినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని డీసీపీ–1 కె.శ్రీనివాసరావు హెచ్చరించారు. దీపావళి పురస్కరించుకుని నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు బాణసంచా తయారీదారులు, విక్రయదారులతో మంగళవారం పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. సమావేశంలో డీసీపీ–2 కె.ఆనందరెడ్డి పాల్గొన్నారు.

**ఇవీ సూచనలు**

- బాణసంచా నిల్వచేసే కేంద్రాల నిర్వాహకులు, తయారీ, విక్రయాలు చేసేవారు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండాలి.

**డీసీపీ–1 శ్రీనివాసరావు**

- బాణసంచా సామగ్రి తయారీ, నిల్వ కేంద్రాలు నివాస ప్రాంతాలకు నిర్దిష్ట దూరంలో ఉండాలి.
- అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- బాణసంచా విక్రయ దుకాణాలను అధికారులు సూచించిన ప్రాంతాల్లోనే ఏర్పాటు చేసుకోవాలి.
- జనావాసాలు, విద్యా సంస్థలు, ఆస్పత్రులకు దూరంగా బాణసంచాను విక్రయించాలి.
- ప్రతీ దుకాణం వద్ద అగ్ని నిరోధక సిలిండర్లు, తగినంత పొడి ఇసుక, కావాల్సిన నీరు అందుబాటులో ఉంచుకోవాలి.
- మైనర్లను బాణసంచా నిల్వ చేసే కేంద్రాల వద్ద, తయారీ, విక్రయ పనుల్లో వినియోగించకూడదు.
- లైసెన్స్ కలిగిన విక్రయదారులు తమ లైసెన్స్‌ను దుకాణాల వద్ద తప్పనిసరిగా ప్రదర్శించాలి.
- అనుమతి పొందిన దుకాణదారులు రాత్రి 9 గంటల వరకే దుకాణాలను తెరిచి ఉంచాలి.
- దీపావళి రోజున సాయంత్రం 5 గంటల తర్వాత ఎటువంటి అమ్మకాలు జరపకూడదు.
- గతేడాది జోన్–1 పరిధిలో 120, జోన్–2 పరిధిలో 120 దుకాణాలకు అనుమతి ఇచ్చారు.
- నివాస ప్రాంతాల్లో అనధికారికంగా బాణసంచా నిల్వ చేస్తే డయల్ 100/112కు, వాట్సాప్ నంబర్ 9493336633, పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 0891–2565454కు గానీ, దగ్గరలోని పోలీస్ స్టేషన్‌కు గానీ సమాచారం అందించాలని డీసీపీ సూచించారు.



## నగరంలో నేడు

- ఉదయం 8 గంటలకు జీవీఎంసీ ఆధ్వర్యంలో ఆర్.కె.బీచ్‌లోని కాళీ మాత ఆలయం వద్ద 'స్వచ్ఛత ఈకో అవార్డుల ప్రదానం', స్వచ్ఛ దీపావళి సిగ్నేచర్ క్యాంపైన్'
- ఉదయం 10 గంటలకు టర్నర్స్ చౌల్ట్రీ ప్రాంగణంలో మహారాణిపేట మండల స్థాయి జగనన్నకు చెబుదాం( స్పందన) కార్యక్రమం
- సాయంత్రం 4 గంటలకు ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో గిటాన్ డయల్ యాప్ ఆవిష్కరణ



# వారెవ్వా.. కూన రొయ్య



పెదవాల్తేరు రోడ్డులో ఎండబెట్టిన కూన రొయ్యలు

- ఇబ్బడి ముబ్బడిగా వలలకు చిక్కుతున్న వైనం
- కొన్నాళ్లుగా తీరానికి చేరువలోనే వీటి లభ్యత
- కిలో ఎండు రొయ్య పొట్టు రూ.200

సాక్షి, విశాఖపట్నం: కూన రొయ్య.. పిల్ల రొయ్యలుగా కనిపించే వీటిని రొయ్య పొట్టుగా కూడా పిలుస్తుంటారు. కొద్దిరోజుల నుంచి మత్స్యకారుల వలలకు ఇవి ఇబ్బడి ముబ్బడిగా చిక్కుతున్నాయి. తీరానికి అతి సమీపంలో అంటే కిలోమీటరు లోపే ఇవి లభ్యమవుతున్నాయి. బీచ్ ల్యాండింగ్ క్రాఫ్ట్ (బీఎల్‌సీ) పడవల్లో వేట సాగించే మత్స్యకారులకు కూన రొయ్యల పంట పండుతోంది. సాధారణంగా రొయ్యల వేట కోసం మత్స్యకారులు బోట్లలో సుదూర ప్రాంతం వెళ్తుంటారు. ఐదు నుంచి ఏడు రోజుల పాటు సముద్రంలో వేట సాగిస్తుంటారు. కానీ ఈ కూన రొయ్యలు తీరానికి చేరువలోనే ఉండడంతో నాటు పడవల్లో వేటకు వేకువజామున వెళ్లి సాయంత్రానికి వచ్చేస్తుంటారు. అందువల్ల మత్స్యకారులకు అంతగా పెట్టుబడి కూడా ఉండదు. ఇలా ప్రస్తుతం విశాఖ తీరంలో రోజుకు ఈ కూన రొయ్యలు టన్ను వరకు పడుతున్నాయి. ఇవి చాలా చిన్నవి కావడంతో ధర కూడా తక్కువగానే ఉంటుంది. కిలో రూ.50–60కే విక్రయిస్తారు. అమ్ముడుపోకుండా మిగిలిపోయిన రొయ్యలను వాహనాల రద్దీ లేని రోడ్లపైన, బీఎల్‌సీ బోట్లపైన ఎండబెడుతుంటారు. ఎండిన రొయ్య పొట్టు కిలో రూ.200 వరకు ధర పలుకుతుంది. ఎండబెట్టిన రొయ్య పొట్టు దాదాపు ఆరు నెలల వరకు పాడవకుండా నిల్వ ఉంటుంది. వీటిని రొయ్యలుగా కొందరు, పొడరుగా మరికొందరు రసంలోనూ, కూరల్లోనూ వాడతారు. వీటిని వినియోగించిన కూరలకు మంచి రుచి రావడంతో వీటికి మార్కెట్లో డిమాండ్ ఉంటుంది.



బీఎల్‌సీ బోట్లపై కూన రొయ్యలను ఎండబెడుతున్న మత్స్యకారులు

### ఈ సీజన్‌లోనే లభ్యం

మత్స్యకారులు వీటిని కూన రొయ్యలుగా పిలుస్తారు. సెమీసిలేటర్స్ శాస్త్రీయ నామంతో పిలిచే ఈ రొయ్యలు ఏడాదిలో శీతాకాలం ఆరంభంలో నవంబరు, డిసెంబరు నెలల్లోనే ఎక్కువగా లభ్యమవుతాయని మత్స్యశాఖ అధికారులు చెప్పారు. ఈ కూన రొయ్యలు పిల్ల రొయ్యల సైజుకు మించి పెరగవు. కొద్ది రోజుల నుంచి శీతల వాతావరణం మొదలవడంతో విశాఖతో పాటు కాకినాడ, కళింగపట్నం, మచిలీపట్నం తదితర తీరప్రాంత సముద్ర జలాల్లో ఇవి విరివిగా లభిస్తున్నాయని మత్స్యకారులు చెబుతున్నారు.

# ఆర్మీ ఉద్యోగిపై దౌర్జన్యం

నలుగురు పోలీసులను ఆర్మ్‌డ్ రిజర్వుకు అటాచ్ చేసిన ఎస్పీ



ఆర్మీ ఉద్యోగిని వ్యానులో ఎక్కించడానికి ప్రయత్నిస్తున్న పోలీసులు

పరవాడ: దిశ యాప్ డౌన్‌లోడ్ విషయంలో పరవాడ పోలీసులు ఓ ఆర్మీ ఉద్యోగిపై దౌర్జన్యానికి పాల్పడిన ఘటన పరవాడలో కలకలం సృష్టించింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. పరవాడ పోలీస్ స్టేషన్‌కు చెందిన నలుగురు పోలీసులు మంగళవారం స్థానిక వారపు సంతలో దిశ యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పోలీసులు సంతకు వచ్చే వినియోగదారులను దిశ యాప్ డౌన్‌లోడ్ కార్యక్రమంలో భాగస్వామ్యం చేశారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన ఓ ఆర్మీ ఉద్యోగిని యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని పోలీసులు కోరారు. ఆయన కూడా వెంటనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఓటీపీ చెప్పగా.. పోలీసులు రాసుకున్నారు. ఇంతలో ఆర్మీ ఉద్యోగికి అనుమానం వచ్చి.. మీకు నేమ్ ప్లేట్ లేదు.. మీ ఐడీ కార్డు చూపించాలని పోలీసులను కోరాడు. దీంతో ఓ మహిళా పోలీసు కానిస్టేబుల్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ మమ్మల్ని ఐడీ కార్డు అడుగుతావా? అంటూ అక్కడే ఉన్న మరో కానిస్టేబుల్‌తో కలిసి ఆర్మీ ఉద్యోగిపై దౌర్జన్యం చేశారు. ఆర్మీ ఉద్యోగిని పోలీస్ స్టేషన్‌కు తరలించడానికి బలవంతంగా వ్యాను ఎక్కించే ప్రయత్నం చేశారు. చివరకు ఆర్మీ ఉద్యోగి ఐడీ కార్డును తీసుకుని వదిలేశారని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. పరవాడలో తమపై ఓ ఆర్మీ ఉద్యోగి దాడికి పాల్పడినట్లు స్థానిక పోలీసు సిబ్బంది స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే ఈ ఘటనపై ఎటువంటి కేసు నమోదు చేయలేదని పరవాడ సీఐ పి.ఈశ్వరరావు తెలిపారు. ఇదిలా ఉండగా ఈ ఘటనపై అనకాపల్లి ఎస్పీ కె.వి.మురళీకృష్ణ స్పందించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న నలుగురు పోలీసులను ఆర్మ్‌డ్ రిజర్వుకు అటాచ్ చేస్తూ, విచారణకు ఆదేశాలు జారీ చేశారు. విచారణ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని ఒక ప్రకటనలో తెలిపారు.

# సెక్యూరిటీ గార్డులకు సీపీ అభినందన

గంజాయి తరలిస్తున్న ముగ్గురు మహిళలను పట్టుకున్న గార్డులు



సెక్యూరిటీ గార్డులకు రివార్డులు ఇస్తున్న నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్

దొండపర్తి: కేజీహెచ్ వద్ద అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముగ్గురు మహిళలను చాకచక్యంగా పట్టుకున్న సెక్యూరిటీ గార్డులను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ అభినందించి రివార్డు అందజేశారు. కేజీహెచ్‌లో పసికందుల దొంగతనాలు, ఇతర అనైతిక చర్యలు నియంత్రించేందుకు ప్రైవేటుగా సాయి సెక్యూరిటీ సర్వీసెస్ నుంచి గార్డులను నియమించారు. సోమవారం ఉదయం 10 గంటల సమయంలో సెక్యూరిటీ విధులు నిర్వహిస్తున్న ఇద్దరు సెక్యూరిటీ గార్డులు అక్కడ అనుమానాస్పదంగా ముగ్గురు మహిళలు కనిపించడంతో ప్రశ్నించారు. వారు పొంతన లేని సమాధానాలు చెబుతూ బ్యాగులు విడిచి పారిపోవడానికి ప్రయత్నించగా, అందులో ఒకరిని పట్టుకున్నారు. వారి బ్యాగుల్లో గంజాయి ప్యాకెట్లు గుర్తించి, మిగిలిన ఇద్దరు మహిళలనూ పట్టుకొని ఒకటో పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు కేజీహెచ్‌కు చేరుకొని మహిళలు తరలిస్తున్న 22 కేజీల గంజాయి, రెండు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మహిళలను అరెస్టు చేశారు. విధులలో చాకచక్యంగా వ్యవహరించిన సెక్యూరిటీ గార్డులు అల్లు కుమారస్వామి, రంగాల వినోద్ కుమార్‌లను తమ కార్యాలయానికి పిలిచి ప్రత్యేకంగా అభినందించారు. వారికి రివార్డు అందజేశారు. ఈ సందర్భంగా సీపీ రవిశంకర్ మాట్లాడుతూ నగరంలో ఎవరైనా ఇటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు గుర్తిస్తే డయల్ 100/112కు గానీ, వాట్సాప్ నంబర్ 9493336633కు గానీ లేదా దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు.

# డూప్లికేట్ ఓట్ల తొలగింపులో అప్రమత్తం



మాట్లాడుతున్న జేసీ విశ్వనాథన్, డీఆర్వో మోహన్ కుమార్

మహారాణిపేట: ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా నకిలీ ఓట్లను తొలగించే క్రమంలో జాగ్రత్త వహించాలని జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్ సూచించారు. ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల పరిధిలోని ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, బీఎల్‌వోలు, సూపర్ వైజర్లతో వీఎంఆర్డీఏ ఎరీనాలో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఒకే డోర్ నంబర్లో అధిక ఓట్లు ఉన్నా, ఒకరి పేరు మీద రెండు ఓట్లు ఉన్నా బీఎల్వోలు స్వయంగా ఆయా ఇళ్లకు వెళ్లి పరిశీలించాలన్నారు. డూప్లికేట్ ఓట్ల తొలగింపులో సంబంధిత ఓటరు నుంచి సమ్మతి తీసుకోవాలని స్పష్టం చేశారు. చిరునామా మారినా, వలస వెళ్లిపోయినా వారి వివరాలను కచ్చితంగా తెలుసుకోవాలన్నారు. చిన్న తప్పు కూడా లేకుండా అత్యంత పారదర్శకతతో తుది ఓటర్ల జాబితాను ప్రచురించేందుకు కృషి చేయాలని జేసీ పిలుపునిచ్చారు. డీఆర్వో కె.మోహన్ కుమార్, ప్రత్యేక ఉప కలెక్టర్లు, తహసీల్దార్లు, బీఎల్వోలు పాల్గొన్నారు.

## 10న సైన్స్ డ్రామా పోటీలు

విశాఖ విద్య: జిల్లా స్థాయి సైన్స్ డ్రామా పోటీలు ఈ నెల 10న నిర్వహిస్తున్నట్లు జిల్లా సైన్స్ అధికారి కప్పల ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. డీఈవో ఎల్.చంద్రకళ ఆదేశాల మేరకు గోపాలపట్నం జెడ్పీ బాలికల పాఠశాల వేదికగా పోటీలు ఏర్పాటు చేశామన్నారు.



# చికిత్స పొందుతూ వలంటీర్ మృతి



దుర్గాభవానీ(ఫైల్)

కూర్మన్నపాలెం: లారీ ఢీకొని తీవ్ర గాయాలు పాలైన మహిళా వలంటీర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపి న వివరాల ప్రకారం కూర్మన్నపాలెం సమీప అగనంపూడి కాలనీలో కోటిచుక్కల ఏసుబాబు, తన భార్య దుర్గాభవానీ(34)తో కలిసి ఉంటున్నాడు. ఏసుబాబు లారస్ ల్యాబ్‌లో ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తుండగా, భార్య దుర్గా భవానీ 86వ వార్డు డాక్‌యార్డ్‌కాలనీ సచివాలయంలో వలంటీర్‌గా విధులు నిర్వర్తిస్తుంది. ఈ క్రమంలో దుర్గాభవానీ సోమవారం విధుల్లో భాగంగా గాజువాకకు ఏసుబాబుతో కలిసి ద్విచక్ర వాహనంపై బయలుదేరింది. సరిగ్గా వడ్లపూడి బ్రిడ్జి వద్దకు వచ్చేసరికి వెనక నుంచి వచ్చిన గుర్తు తెలియని లారీ బలంగా ఢీకొంది. వారిద్దరూ అదుపు తప్పి రోడ్డుపై పడిపోయారు. ఏసుబాబు స్వల్ప గాయాలతో బయటపడగా, దుర్గాభవానీకి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆమెను కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించగా.. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందింది. ఈ ఘటనపై ఏసుబాబు ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## లేపాక్షిలో హస్తకళల ప్రదర్శన, విక్రయాలు



కళాకారులు రూపొందించిన బొమ్మలు

డాబాగార్డెన్స్: లేపాక్షి, జగదాంబ షోరూమ్‌లో రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ హస్త కళాకారులు రూపొందించిన వస్తువులను నేరుగా విక్రయిస్తున్నట్లు షోరూం మేనేజర్ కార్తీక్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 6న ప్రారంభమైన ఈ విక్రయాలు ఈ నెల 11 వరకు ఉంటాయని తెలియజేశారు. ఈ ప్రదర్శనలో నరసాపూర్ లేస్, ఏటికొప్పాక బొమ్మలు, రాజమండ్రి కర్రబొమ్మలు, అనంతపురం తోలు బొమ్మలు, కొండపల్లి బొమ్మలను హస్తకళాకారులు నేరుగా విక్రయిస్తున్నారని చెప్పారు. హస్తకళాకారులను ప్రోత్సహించాలని కోరారు.

## 10న ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఈ నెల 10న కర్లికల్, టెక్నికల్ విభాగాల ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి (క్లరికల్) సీహెచ్ సుబ్బిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. హెటిరో డ్రగ్స్, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్, పేటీఎం, టీసీఎస్ డిజిటల్, శ్రీరామ్ చిట్స్, నవత రోడ్ ట్రాన్స్‌పోర్ట్, పీఎస్‌టీ ఇండస్ట్రీస్, హనీ గ్రూప్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల్లో 275 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జూనియర్ కెమిస్ట్, జూనియర్ ట్రైనీ, డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్స్, ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, ఆఫీస్ అసిస్టెంట్, అకౌంట్స్ అసిస్టెంట్, రికవరీ క్లర్క్, బ్రాంచ్ ఇన్‌చార్జి వేర్ హౌస్ ఎగ్జిక్యూటివ్స్, ప్లాంట్ హెల్పర్ ఉద్యోగాలకు.. ఆయా పోస్టులను బట్టి టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, పీజీ పాసైన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థుల వయసు 18 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉండాలని పేర్కొన్నారు. పోస్టును బట్టి వేతనం నెలకు రూ.15,300 నుంచి రూ.32,500 వరకు ఉంటుందని తెలియజేశారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు కంచరపాలెం జిల్లా ఉపాధి కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు హాజరు కావాలని కోరారు.

## మనస్తాపంతో ఉరేసుకుని ఆత్మహత్య

- కన్న కూతురుతో అసభ్యకరంగా ప్రవర్తించాడని మందలించిన భార్య

మల్కాపురం : కన్న కూతురుతో అసభ్యకరంగా ప్రవర్తించిన విషయం తెలుసుకున్న భార్య మందలించిందని మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం సమీప గాంధీజీ వీధి ప్రాంతంలో బలరామ్ సిద్ధూ (40) భార్య, 11 ఏళ్ల కుమార్తెతో కొంత కాలంగా నివసిస్తున్నాడు. ప్లంబింగ్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం ఇంట్లో ఉన్న కుమార్తెతో బలరామ్ అసభ్యకరంగా ప్రవర్తించాడని తెలుసుకున్న భార్య మందలించింది. దీంతో వారిద్దరి మధ్య వాదన జరిగింది. అనంతరం బలరామ్ తన గదిలోకి వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అనుమానంతో భార్య కిటికీలో నుంచి చూడగా గదిలో ఫ్యానుకు వేలాడుతున్న బలరామ్‌ను స్థానికుల సాయంతో ఆస్పత్రికి తరలించే క్రమంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మల్కాపురం పోలీసులు ఘటన స్థలికి చేరుకుని వివరాలు సేకరించి, కేసు నమోదు చేశారు.